సాక్షి
యాదాద్రి భువనగిరి
శుక్రవారం । 7 । జూలై । 2023



సమస్యలు పరిష్కరించాలి
సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెబాట పట్టారు.
- 9లో



పాలాభిషేకం
అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయడంతో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.
- 9లో

గరిష్ఠం/కనిష్ఠం
30°/24°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పరిహారం మంజూరు

సాక్షి, యాదాద్రి : మార్చి, ఏప్రిల్ నెలలో కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలులకు దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేసింది. 4,450 మంది రైతులకు చెందిన 5207.37 ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లగా రూ.5.20 కోట్లు విడుదల చేసింది. రెండు,మూడు రోజుల్లో కలెక్టర్ ఖాతాలో జమ చేసి, ఆ తర్వాత రైతులకు ఖాతాలకు మళ్లించనున్నారు.

స్వరాష్ట్రంలో కులవృత్తులకు పూర్వవైభవం



మత్స్యపారిశ్రామిక భవనానికి శంకుస్థాపన చేస్తున్న గొంగిడి సునీత

యాదగిరిగుట్ట రూరల్ : స్వరాష్ట్రంలో కులవృత్తులు పూర్వ వైభవం సంతరించుకున్నాయని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత పేర్కొన్నారు. యాదగిరిగుట్ట మండలం చిన్నకందుకూరు మధిర బాపనగూడెంలో మత్స్యపారిశ్రామిక భవనానికి గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కేసీఆర్ చేయూతనిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలతో వారికి మంచి రోజులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, సర్పంచ్ నమిలె రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ ఎర్ర పోచయ్య, టీఆర్ఎస్ మండల యూత్ ప్రధాన కార్యదర్శి బీమగాని నర్సింహ, ముదిరాజ్ కుల పెద్ద గడ్డం మల్లయ్య, పెద్దిరాజు, సంఘం అధ్యక్షులు గిరిబోయిన సిద్దులు, టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు కట్ట మల్లేష్, ఎల్లయ్య, మల్లయ్య, రమేష్, రాజయ్య పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బదిలీ

భువనగిరి : జిల్లా ప్రధాన న్యాయమూర్తి బాల భాస్కర్‌రావు హైకోర్టు రిజిస్ట్రార్ అడ్మిన్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు హైకోర్టు నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మారుతిదేవి ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు.

మత్స్యగిరిలో దుకాణాలకు వేలం

వలిగొండ : మండలంలోని వెంకటాపురంలో గల శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దుకాణాలకు గురువారం టెండర్ కం వేలం నిర్వహించారు. కొబ్బరి చిప్పలు సేకరించుకునేందుకు మత్స్యగిరి గుట్టకు చెందిన మహేష్, ,కూల్డ్రింక్స్, హోటల్ నిర్వహణ వెంకటాపురానికి చెందిన మంటిపల్లి పూలమ్మ దక్కించుకున్నారు. బొమ్మలు, క్యాసెట్లు, మణిహారం, వాహన పూజా సామగ్రి, కొబ్బరికాయలు విక్రయం, టోల్‌గేట్, ఫొటో స్టూడియో నిర్వహణకు టెండర్‌దారులు ఎవరూ పాల్గొనలేదు. తలనీలాలకు సంబంధించి సరైన పాట రానందున వాయిదా వేసినట్లు ఈఓ మోహన్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో పరిశీలకులు నిఖిల్, టెండర్‌దారులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభకు భారీగా తరలిరావాలి



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

సాక్షి, యాదాద్రి: వరంగల్‌లో ఈ నెల 8న నిర్వహించనున్న ప్రధాని మోదీ బహిరంగ సభకు జిల్లా నుంచి సుమారు 5 వేల మంది కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని భువనగిరి ఇన్‌చార్జ్, దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు కోరారు. గురువారం భువనగిరిలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భువనగిరి నియోజకవర్గం నుంచి కార్యకర్తలను తరలించే బాధ్యతను తాను తీసుకుంటున్నట్లు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణ ప్రకటించారు. అదే విధంగా ఆలేరు నియోజకవర్గం నుంచి కూడా సుమారు 5 వేల మందిని తరలించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం భాస్కర్, పోతంశెట్టి రవీందర్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, బీజేవైఎం జాతీయ కోశాధికారి సాయి, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, భువనగిరి పట్టణ అధ్యక్షుడు ఉమాశంకర్, బీబీనగర్ మండల అధ్యక్షుడు జంగారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మాయ దశరథ, జిల్లా ఉపాధ్యక్షుడు చందామహేందర్‌గుప్తా పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎం) మండలం పుల్లయ్య గూడెంలో పిల్లలు లేకున్నా ఉపాధ్యాయుడు ఉన్నాడు. రహీంఖాన్‌పేటలో ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. వీరిలో 5వ తరగతిలో ఇద్దరు, మూడవ తరగతిలో ఇద్దరు, రెండవ తరగతి ఇద్దరు ఉన్నారు. వీరికి ఇద్దరు టీచర్లు బోధన చేస్తున్నారు.



సంస్థాన్‌నారాయణపురం మండలంలోని రాచకొండ ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు ఉంది. 2వ తరగతిలో మాత్రమే ఒక్క విద్యార్థి ఉన్నాడు. మిగతా నాలుగు తరగతుల్లో విద్యార్థులు లేరు. ఉన్న ఒక్కగానొక్క విద్యార్థికి ఒక ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నాడు.



యాదగిరిగుట్ట మండలం తాళ్లగూడెం పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు ఉండగా ఈ విద్యా సంవత్సరం వారంతా ప్రైవేట్ స్కూల్‌కు వెళ్లారు. ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయుడిని బాహుపేటకు పంపించారు. మహబూబ్‌పేట ప్రాథమిక పాఠశాలలో తొమ్మిది మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా ఒకరిని డిప్యూటేషన్‌పై పంపించారు. గొల్లగూడెం ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు.



టీచర్లున్నా పిల్లలు లేరు!

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న ప్రవేశాలు

- ఈ ఏడాది 8,479 మంది మాత్రమే చేరిక
- విద్యార్థులు లేని చోట ఉపాధ్యాయులు
- ఖాళీగా ఉన్నవారిని డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు..
- పలు చోట్ల మూతపడ్డ స్కూళ్లు
- 'సాక్షి' పరిశీలనలో వెలుగుచూసిన వాస్తవాలు



ఆరుగురు విద్యార్థులతో నడుస్తున్న వలిగొండ మండలంలోని వెంకటాపురం పాఠశాల



భువనగిరి మండలం హన్మాపురంలో ఒకే గదిలో అన్ని తరగతుల విద్యార్థులకు బోధన

మొత్తం పాఠశాలలు	712
విద్యార్థులు (గత ఏడాది)	49,081
ఈ విద్యాసంవత్సరం	46,162

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఆ శాఖ చర్యలెన్ని చేపడుతున్నా ఏదో ఒక సమస్య వేధిస్తూనే ఉంది. ఉపాధ్యాయులున్న చోట విద్యార్థులు లేకపోవడం.. విద్యార్థులు ఉన్న చోట సరిపడా టీచర్లు లేకపోవడం వంటి పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను గురువారం సాక్షి విజిట్ చేయగా వాస్తవాలు వెలుగుచూశాయి. పలు పాఠశాలల్లో అసలే విద్యార్థులు లేకపోగా.. మరికొన్ని చోట్ల తక్కువగా ఉండడంతో వారందరినీ ఒకే గదిలో కూర్చోబెట్టి విద్యాబోధన చేస్తున్నారు. కొందరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపించారు. అడ్మిషన్ల సంఖ్య తగ్గడంతో పాటు డ్రాపౌట్స్ నమోదవుతుండడం అధికారులను కలవరపెడుతోంది.

◆ ఆలేరు మండలం శర్బనాపురం పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు ఉంది. మొత్తం 15 మంది విద్యార్థులు ఉన్నారు. 1వ తరగతిలో ఇద్దరు, రెండులో ముగ్గురు, మూడవ తరగతిలో ముగ్గురు, నాలుగో తరగతిలో ఆరుగురు, 5వ తరగతిలో ఒక్క విద్యార్థి ఉన్నారు. వీరందరినీ ఒకటే గదిలో కూర్చోబెట్టి విద్యాబోధన చేస్తున్నారు.

◆ మోత్కూర్ మండలంలోని కొండాపురం, రాగిబావి, రాజన్నగూడెం ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేకపోవడంతో ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు పంపించారు.

◆ బీబీనగర్ మండలంలోని లక్ష్మీదేవిగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు లేకపోవడంతో ఇద్దరు ఉపాధ్యాయులను రహీంఖాన్‌గూడెం, కొండమడుగుకు డిప్యూటేషన్‌పై పంపారు. అదే విధంగా గుర్రాలదండి పరిధిలోని కొత్త తండా పాఠశాలలో 20 మంది విద్యార్థులు ఉండగా ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు.

◆ భువనగిరి మండలం హనుమాపురం పరిధిలోని కురుమగూడెం ప్రాథమిక పాఠశాలలో 8 మంది విద్యార్థులు ఉన్నారు. 1వ తరగతిలో ఒక్క విద్యార్థి కూడా లేడు. రెండవ తరగతిలో ఒక్కరు, మూడులో ఒక్కరు, నాలుగులో ఇద్దరు, ఐదవ తరగతిలో నలుగురు ఉన్నారు. ఇక్కడ ఇద్దరు టీచర్లు పని చేస్తుండగా ఒకరిని మరో పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపారు. ఇక సింగిరెడ్డిగూడెం, రెడ్డినాయక్‌తండా పరిధిలో గల ప్రాథమిక పాఠశాలలో పది లోపు విద్యార్థులు ఉండగా ఒక టీచర్ నిర్వహిస్తున్నారు.

◆ వలిగొండ మండలం వెంకటాపురంలో 5వ తరగతి వరకు ఉంది. ఇక్కడ ఆరుగురు విద్యార్థులు ఉన్నారు. వారు కూడా సక్రమంగా రాకపోవడంతో పాఠశాల మూతపడే స్థితిలో ఉంది. ఇద్దరు ఉపాధ్యాయులకు ఒకరిని డిప్యూటేషన్‌పై పంపించారు.

◆ బొమ్మలరామారం మండలం మైసిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. విద్యార్థులు తక్కువగా ఉండడంతో ఒక ఉపాధ్యాయున్ని వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో భాగంగా వేరే పాఠశాలకు పంపించారు. ఆరుగురు విద్యార్థులు రికార్డుల్లో నమోదై ఉన్నా గురువారం ఒక్కరు కూడా పాఠశాలకు హాజరుకాలేదు. దీంతో ఉపాధ్యాయుడు ఖాళీగా కూర్చున్నాడు.

◆ భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పద్మానగర్ పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు ఉంది. 13 మంది విద్యార్థులు ఉండగా.. ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

◆ రామన్నపేట మండంలోని లక్ష్మాపురం ఉన్నత పాఠశాలలో 17 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ గెజిటెడ్ హెడ్మాస్టర్‌తో పాటు నలుగురు స్కూల్ అసిస్టెంట్లు, ఒక హిందీ పండిట్ పని చేస్తున్నారు

◆ రాజాపేట మండలంలోని బసంతాపురం పాఠశాలలో 13 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు బోధన చేస్తున్నారు.

◆ చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం ప్రాథమిక పాఠశాలలో 37 మంది విద్యార్థులు ఉన్నారు. హెచ్‌ఎం డిప్యూటేషన్‌పై వెళ్లగా ప్రస్తుతం ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నారు.

◆ తుర్కపల్లి మండలంలోని మోతిరాంతండాలో ఐదు తరగతుల్లో 15 మంది విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు ఉన్నారు. వారందరినీ ఒకే గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు.

ముగిసిన బడిబాట

భువనగిరి : రెండో విడత బడిబాట కార్యక్రమం గురువారం ముగిసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 8,479 మంది బడిబయట పిల్లలను గుర్తించారు. వారందరినీ బడిలో చేర్పించారు.

ఒకే గదిలో ఐదు తరగతులు

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5వ తరగతి వరకు ఉండగా 22 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా ఒకరు దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. ఒక్కడే ఉపాధ్యాయుడు ఉండడంతో ఐదు తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి పాఠశాలు చెబుతున్నాడు.



అడ్డగూడూరులో ఒకే గదిలో ఐదు తరగతుల విద్యార్థులకు బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

గుండాల మండలంలో ఇలా..

మాసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలల్లో 32 మంది విద్యార్థులకు ఒక్కడే ఉపాధ్యాయుడు ఉన్నాడు. పాచిల్లలో 27 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు బోధన చేస్తున్నారు.



మాసన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో 33 మంది విద్యార్థులకు ఒక్కడే ఉపాధ్యాయుడు..

విద్యార్థులు లేకున్నా ఇద్దరు టీచర్లు

మోటకొండూరు మండలంలోని గిరిబోయిన గూడెం, నాంచారిపేట ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు లేకున్నా ఇద్దరు టీచర్లు ఉన్నారు. అలాగే చందపల్లి హైస్కూల్‌లో ఇద్దరు విద్యార్థులకు గాను నలుగురు టీచర్లు ఉన్నారు. వీరిలో ఒకరిని కొలనుపాకకు డిప్యూటేషన్‌పై పంపిచారు.

మెరుగైన బోధన చేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు, నాణ్యమైన విద్య అందకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్‌కు పంపిస్తున్నారు. ఉపాధ్యాయులు కూడా సరైన రీతిలో పాఠాలు బోధించడం లేదు. విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన ఉండాలి.

–గద్దం పెద్దిరాజు, మహబూబ్‌పేట

నారాయణపురం ఎంపీపీపై అవిశ్వాస నోటీసు

- ఆర్డీఓకు అందజేసిన 11 మంది ఎంపీటీసీలు



ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డికి అవిశ్వాసం నోటీసు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యులు

చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం : సంస్థాన్ నారాయణపురం ఎంపీపీ గుత్తా ఉమాదేవి(బీఆర్ఎస్)పై ఎంపీటీసీలు అవిశ్వాసం తీర్మానం కోరుతూ ఆర్డీఓకు నోటీసు ఇచ్చారు. ఈ మేరకు గురువారం చౌటుప్పల్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కంచర్ల వెంకట ఉపేందర్‌రెడ్డికి నోటీసు అందజేశారు. నారాయణపురం మండలంలో మొత్తం 13మంది ఎంపీటీసీలు ఉండగా ఎంపీపీతోపాటు మరొక ఎంపీటీసీ మినహా మిగిలిన తొమ్మిది మంది సంతకాలు చేశారు. వీరిలో బీఆర్ఎస్ సభ్యులు 9, సీపీఎం సభ్యుడు ఒకరు, సీపీఐ సభ్యుడు ఒకరు ఉన్నారు. సంపూర్ణ మెజార్టీ ఉన్నప్పటికీ సొంత పార్టీ సభ్యులే అవిశ్వాసం ప్రకటించడం వెనక రాజకీయ కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఎవరి ప్రయత్నాలు వారివే..

ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం గెలిస్తే నూతన ఎంపీపీ ఎన్నిక అనివార్యం కానుంది. ఈ నేపథ్యంలో ఎంపీపీ పదవి కోసం ఎవరికి వారు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా ఇద్దరు మహిళా ఎంపీటీసీ సభ్యులు పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వారు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వీరిద్దరిలో బీఆర్ఎస్ పార్టీ ఆశీస్సులు ఎవరికి ఉంటే వారు పీఠంపై కూర్చునే అవకాశాలున్నాయి. కాగా బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీపీపై అదే పార్టీకి చెందిన సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు ఆర్డీఓకు నోటీసు ఇవ్వడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారం పార్టీ పెద్దలకు తెలిసే జరుగుతుందా, తెలియకుండా చేస్తున్నారా అనే విషయంపైనా చర్చ జరుగుతోంది. ఒక వేళ పార్టీ పెద్దలకు తెలియకుండా జరిగితే ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారోనని రాజకీయ పార్టీలో చర్చ సాగుతోంది.

కాంగ్రెస్‌లో కమిటీల చిచ్చు!

- భువనగిరి నియోజకవర్గ కమిటీలపై కోమటిరెడ్డి వర్గీయుల అసంతృప్తి
- రద్దు చేయాలని గాంధీభవన్ ఎదుట ఆందోళన

సాక్షి, యాదాద్రి : భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ నూతనంగా ఏర్పాటు చేసిన కమిటీలతో పార్టీలో చిచ్చు రగిలింది. కమిటీలను ఏకపక్షంగా నియమించారంటూ కోమటిరెడ్డి వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ ఎదుట ఆందోళనకు దిగారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి పేరున ఉత్తర్వులు జారీ కావడంతో ఆయన కారు ఎదుట బైఠాయించారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలు, రెండు మున్సిపాలిటీలకు నియమించిన నూతన అధ్యక్షులను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోధ శ్రీనివాస్ గౌడ్, వడపర్తి సర్పంచ్ ఎలిమినేటి కృష్ణారెడ్డి, గుమ్మడిల్లి రమేష్ తదితరులుఉన్నారు.

బయటపడ్డ విభేదాలు

భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్గీయుల ఆందోళనతో కాంగ్రెస్‌లో మరోసారి వర్గ విభేదాలు బయటపడ్డాయి. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మధ్య కొంత కాలంగా వర్గపోరు సాగుతోంది.

అర్హులందరికీ పోడు పట్టాలివ్వాలి



సంస్థాన్‌నారాయణపురంలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న చలమల్ల కృష్ణారెడ్డి


- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి

సంస్థాన్ నారాయణపురం : పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులందరికీ పట్టాలివ్వాలని కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గ ఇంచార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. రాచకొండలో అసైన్డ్, సీలింగ్, లావుని భూములకు డిజటల్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం రైతులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి పేరుతో ప్రభుత్వం భూములు గుంజుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. పోడు పట్టాల కోసం 1600 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 70 మందికి మాత్రమే పట్టాలు ఇచ్చారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగా రైతులందరికీ పట్టా పాసు పుస్తకాలు ఇస్తామన్నారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరు వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఏపూరి సతీష్, నాయకులు మందుగుల భాలకృష్ణ, నర్సిరెడ్డి, బుజ్జి, బైకని నరేందర్, నేరడి నర్సింహ్మ, నరేష్ , యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

2వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

- 2024 చివరి నాటికి 8,700 ఎకరాలు లక్ష్యం
- ఇప్పటి వరకు 2 వేల ఎకరాల్లో సాగు
- మరో 300 మంది దరఖాస్తు
- ప్రభుత్వ ప్రోత్సాహకాలతో సత్ఫలితం



ఆత్మకూరు(ఎం) మండలం సర్వేపల్లి వద్ద సాగవుతున్న ఆయిల్‌పామ్ తోట

ఆత్మకూరు(ఎం) : ఆయిల్‌పామ్ సాగుపై క్రేజీ పెరుగుతోంది. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలు, గిట్టుబాటు ధర, సంప్రదాయ పంటలతో ఎదురవుతున్న ఇబ్బందుల వల్ల రైతులు ఆయిల్‌పామ్ వైపు అడుగులు వేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో నాలుగేళ్లలో 8,700 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించగా.. ఏడాదిన్నర కాలంలోనే 2000 ఎకరాలకు చేరింది. మరో 2వేల ఎకరాలకు రైతులు దరఖాస్తు చేసుకున్నారు.

ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో..

జిల్లాలో 2021 నుంచి ఆయిల్‌పామ్‌పై ఆయిల్‌ఫెడ్ సంస్థ దృష్టి సారించింది. ప్రారంభంలో 250 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు కాగా ప్రస్తుతం 390 మంది రైతులు 2022 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మరో 300 మంది రైతులు 2వేల ఎకరాల్లో సాగు చేయడానికి ఆయిల్‌ఫెడ్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కాగా జిల్లాలో చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్‌పోచంపల్లి, గుండాల, ఆత్మకూరు(ఎం), భువనగిరి, బీబీనగర్, బొమ్మలరామారం, రాజాపేట, తుర్కపల్లి, ఆలేరు, యాదగిరిగుట్ట, మోటకొండూరు, వలిగొండ, రామన్నపేట, మోత్కూరు, అడ్డగూడూరు మండలాల్లో ఆయిల్‌పామ్ ఎక్కువగా సాగవుతోంది.

అంతర పంటలకు అవకాశం

ఆయిల్‌పామ్ ఒక్కసారి మొక్క నాటితే 30 ఏళ్ల రాబడి ఉంటుంది. ఎకరం వరికి వినియోగించే నీరు నాలుగు ఎకరాలు ఆయిల్‌పామ్ తోటకు సరిపెట్టవచ్చు. ఎకరాకు ఏటా రూ. లక్ష వరకు ఆదాయం వస్తుంది. మొక్కలు నాటినప్పటి నుంచి నాలుగేళ్ల వరకు వక్క, మిర్చి, కూరగాయలు, వేరుశనగ, అరటి, జామ, పొప్పడి తదితర పంటలను అంతరంగా సాగు చేయవచ్చు.

సత్ఫలితాలనిస్తున్న సదస్సులు, ప్రోత్సాహకాలు

రైతులను ఆయిల్‌పామ్ సాగుపై మళ్లించేందుకు ఆయిల్‌ఫెడ్ సంస్థ అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. వరి, పత్తి వంటి సంప్రదాయ పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్ సాగుతో చేకూరే ప్రయోజనాల గురించి ఆ సంస్థ అధికారులు వివరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రోత్సాహకాలు అందజేస్తుండడంతో రైతులు పెద్ద సంఖ్యలో ఆయిల్‌పామ్ వైపు అడుగులు వేస్తున్నారు.

దత్తప్పగూడెంలో నర్సరీ

ఆయిల్‌పామ్ మొక్కల పెంపకం కోసం మోత్కూరు మండలం దత్తప్పగూడెం వద్ద సుమారు 50 ఎకరాల్లో నర్సరీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నర్సరీలో 2.50 లక్షల మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. మరో 3 లక్షలు మొక్కలు పెంపకం దశలో ఉన్నాయి. గడువులోపు లక్ష్యం చేరుకునేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

రాయితీలు ఇలా..



◆ ఆయిల్‌పామ్ మొక్క ఖరీదు రూ.193. ప్రభుత్వం రూ.173 సబ్సిడీ ఇస్తుండటంతో రైతుకు రూ.20కే మొక్క అందజేస్తున్నారు.
◆ అంతరపంటలు సాగు చేసిన రైతులకు ఏడాదికి నాలుగుసార్లు రూ.2100ల చొప్పున ప్రోత్సహకం అందజేస్తారు.
◆ ఎరువుల వినియోగానికి ఎకరాకు ఏడాదికి నాలుగుసార్లు రూ.2100 చొప్పున అందజేస్తారు.
◆ ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీపై, బీసీ, ఓసీలకు రూ.90 శాతంపై, ఓసీలకు ఐదెకరాలకు మించి ఉన్నట్లయితే 80 శాతం సబ్సిడీపై డ్రిప్ మంజూరు చేస్తారు.
◆ ఆయిల్‌పామ్ గెలలను వ్యవసాయ క్షేత్రం నుంచి ఫ్యాక్టరీ వరకు తీసుకెళ్లేందుకు రవాణా ఖర్చులు ప్రభుత్వమే చెల్లిస్తుంది.

ఏ సమస్యా లేదు



పది ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేశాను. కోతుల బెడద, అకాల వర్షాలు, ఈదురు గాలులతో ఎటువంటి సమస్య లేదు. అంతరపంటగా వక్క సాగు చేశాను. ఇందుకు గాను ఎరువుల ఖర్చుకోసం ఆయిల్ ఫెడ్ సంస్థ నుంచి రూ.42వేలు ప్రోత్సాహకం అందింది.

– మల్లెపూల ఉపేందర్, మోదుగుకుంట

రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు



ఆయిల్‌పామ్ సాగు చేయడానికి రైతులు ముందుకొస్తున్నారు. రైతులు కోరిన చోట సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం. జిల్లా రైతులకు అందుబాటులో ఉండేలా సిద్దిపేటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నాం. ఆసక్తి ఉంటే రైతులను ఖమ్మం జిల్లా అశ్వారావుపేటకు తీసుకెళ్లి అక్కడ సాగవుతున్న ఆయిల్‌పామ్ తోటను చూపిస్తాం. గడువు లోపు లక్ష్యం చేరుకుంటాం.

– కంచర్ల రామకృష్ణారెడ్డి, ఆయిల్‌ఫెడ్ చైర్మన్

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


గోపి (ఫైల్)

కనగల్: విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతిచెందిన ఘటన కనగల్ మండల పరిధిలోని శాబ్దుల్లాపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. శాబ్దుల్లాపురం గ్రామానికి చెందిన కోల వెంకన్న, ముత్తమ్మ దంపతుల మొదటి కుమారుడు కోల గోపి(20) గ్రామంలోని కిరాణ దుకాణానికి వెళ్లి నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా రోడ్డు పక్కన స్తంభానికి ఉన్న విద్యుత్ తీగలు తెగి అతడి మీద పడ్డాయి. దీంతో అతడు విద్యుదాఘాతానికి గురై అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. పక్కనే వెళ్తున్న రైతు అశోక్ గమనించి కర్ర సహాయంతో విద్యుత్ తీగలను తొలగింపజేశాడు. చుట్టుపక్కల వారి సహాయంతో 108 వాహనంలో గోపిని నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. చేతికి అందొచ్చిన కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. గోపి తండ్రి వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కనగల్ పోలీసులు తెలిపారు.

యాదాద్రి పవర్ ప్లాంట్‌లో చోరీ.. నిందితుల అరెస్ట్

మిర్యాలగూడ: దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో యంత్రాలకు అమర్చే సుమారు రూ.98వేల విలువైన బేరింగ్‌లను చోరీ చేసిన నిందితులను గురువారం దామరచర్ల మండల కేంద్రం శివారులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 2వ తేదీన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పనులు చేస్తున్న ఆల్ఫా పవర్ ఇంజనీరింగ్ సర్వీస్ లిమిటెడ్‌కు చెందిన 6 లైన్ సాఫ్ట్ ఇత్తడి బేరింగ్‌లు చోరీ గురయ్యాయి. దీంతో సంస్థకు చెందిన వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసకొని విచారణ చేపట్టిన పోలీసులు గురువారం దామరచర్ల శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా మిర్యాలగూడ వైపు వెళ్తున్న బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా చోరీకి గురైన మెటీరియల్ ఉండడంతో అందులో ప్రయాణిస్తున్న పయ్యావుల సైదారావు, తురక రమేష్, క్రాంతి, చెన్నబోయిన శ్యామ్‌ను అదుపులోకి తీసుకోని విచారించగా నిజం అంగీకరించారు. దీంతో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కానిస్టేబుళ్లు అనిల్‌కుమార్, భాస్కర్, సైదులు, ఖయ్యూం, రషీద్, సతీష్ తదితరులు ఉన్నారు.

అసభ్య పదజాలంతో దూషించాడని హత్య

- వీడిన అల్వాలపహాడ్ వాసి మర్డర్ మిస్టరీ
- ఇద్దరు నిందితుల అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన హాలియా సీఐ గాంధీనాయక్


వివరాలు వెల్లడిస్తున్న హాలియా సీఐ గాంధీ నాయక్, వెనుక నిందితులు

త్రిపురారం: జనం అందరి ముందు తనను అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తిపై కక్ష పెంచుకొని కత్తితో పొడిచి హత్య చేసిన నిందితులను పోలీసులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ శోభన్‌బాబుతో కలిసి హాలియా సీఐ గాంధీనాయక్ విలేకరులకు వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలంలోని బి.అన్నారం గ్రామానికి చెందిన రాందేని శివ హాలియాలోని సోనాలిక ట్రాక్టర్ షోరూంలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అంతే కాకుండా త్రిపురారం మండలానికి సేల్స్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ ప్రతి గ్రామానికి తిరుగుతూ సోనాలిక ట్రాక్టర్ల గురించి ప్రచారం చేస్తున్నాడు. జూన్ 29న బి.అన్నారం గ్రామానికే చెందిన తన మిత్రుడు పేరూరు శివతో కలిసి త్రిపురారం మండలంలోని అల్వాలపహాడ్ గ్రామానికి వెళ్లిన రాందేని శివ అక్కడ ట్రాక్టర్ యజయానులకు సోనాలిక ట్రాక్టర్ గురించి వివరిస్తున్నాడు. అదే సమయంలో అల్వాలపహాడ్ గ్రామానికే చెందిన బొలిగోర్ల వెంకన్న వారి వద్దకు వచ్చి 'ముందు మాయమాటలు చెప్పి ట్రాక్టర్లు కొనేటట్లు చేస్తారు.. తర్వాత కిస్తీలు కట్టాలని ఇబ్బందులు పెడతారు' అని రాందేని శివ, పేరూర్ శివను అసభ్య పదజాలంతో దూషిస్తూ గొడవపడ్డాడు. దీంతో వెంకన్నపై కక్ష పెంచుకున్న రాందేని శివ ఎలాగైనా అతడిని చంపాలని నిర్ణయించుకున్నాడు. అదేరోజు ఏకాదశి పండుగ కావడంతో బొలిగోర్ల వెంకన్న తన బావమరిది రావుల కోటయ్యతో కలిసి బైక్‌పై అడవిదేవులపల్లి మండలంలోని సత్రశాలకు దైవదర్శనానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో త్రిపురారం మండలం చెన్నాయిపాలెం గ్రామ శివారులోని అల్వాలపహాడ్ ఎక్స్‌రోడ్ వద్దకు రాగానే రాందేని శివ, పేరూర్ శివ కలిసి బైక్‌పై వెనుక కూర్చొని ఉన్న బొలిగోర్ల వెంకన్న మెడ, ఛాతీ, వీపుపై పదునైన కత్తితో పొడిచి ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరుకు పారిపోయారు. గాయపడిన వెంకన్నను స్థానికులు ఆటోలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న త్రిపురారం పోలీసులు సీఐ గాంధీనాయక్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. కాగా బుధవారం నిందితులు రాందేని శివ, అతడి స్నేహితుడు పేరూర్ శివ గుంటూరు నుంచి తమ స్వగ్రామానికి వస్తుండగా ఎస్‌ఐ శోభన్‌బాబు తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకొని విచారించగా వెంకన్నను తామే హత్య చేసినట్లు నిజం ఒప్పుకున్నారు. దీంతో వారిద్దరిని రిమాండ్‌కు తరలించారు. నిందితులను పట్టుకోవడంలో వేగంగా స్పందించిన త్రిపురారం ఎస్‌ఐ శోభన్‌బాబు, ఏఎస్‌ఐ రామయ్య, ఇతర పోలీసు సిబ్బందిని సీఐ గాంధీ నాయక్ అభినందించారు.

రౌడీ షీటర్‌గా గుర్తించడంలేదని..?

రాందేని శివ తండ్రి కరోనా సమయంలో మరణించాడు. తల్లికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. రాందేని శివపై గతంలో రౌడీ షీట్ ఉన్నట్లు పోలీసుల ద్వారా తెలిసింది. తనను ఎవరూ గుర్తించడంలేదని, ఎలాగైనా ప్రజల్లో గుర్తింపు పొందాలనే ఉద్దేశంతోనే వెంకన్నను రాందేని శివ హత్య చేసినట్లుగా తెలుస్తోంది.

పోలీసులకు సమాచారం ఇవ్వాలి

యువత చెడు మార్గంలోకి వెళ్లకుండా ఉండాలి. క్షణికావేశంలో చట్ట వ్యతిరేక పనులకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దు. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. మండలంలోని ప్రతి గ్రామంలో పోలీసు సిబ్బంది విస్తృతంగా పెట్రోలింగ్ చేసేలా చూస్తాం.

– గాంధీ నాయక్, సీఐ, హాలియా

క్రెడిట్ కార్డు ఇప్పిస్తామని మోసం

- యాప్ డౌన్‌లోడ్ పేరుతో రూ.1.34 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

నకిరేకల్: క్రెడిట్ కార్డు ఇప్పిస్తామని చెప్పి యాప్ డౌన్‌లోడ్ పేరుతో ఓ వ్యక్తి బ్యాంక్ ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.34 లక్షలు కాజేశారు. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌కు చెందిన పోడిచెటి శ్రీనుకి గురువారం గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి మీ బ్యాంక్ ఖాతా నంబర్లకు క్రెడిట్ కార్డు ఎలిజిబులిటీ ఉందని చెప్పాడు. క్రెడిట్ కార్డు పొందాలంటే ముందుగా ఫోన్‌లో రస్క్ డెస్క్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమన్నాడు. ఆ తర్వాత మొబైల్‌కు వచ్చిన ఓటీపీ నంబర్ చెప్పమని అడిగాడు. శ్రీను సదరు వ్యక్తి ఫోన్‌లో చెప్పింది నమ్మి సెల్‌కు వచ్చిన ఓటీపీ నంబర్‌ను అతడికి చెప్పాడు. ఆ తర్వాత ఆ వ్యక్తి ఫోన్ పెట్టేయగా, కొద్దిసేపటికే శ్రీనుకు గల హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాక్ ఖాతాల నుంచి రూ.1.34 లక్షలు కట్ అయినట్లు మెసేజ్ రావడంతో బిత్తరబోయాడు. వెంటనే బ్యాంక్ ఖాతాలు చెక్ చేసుకోగా డబ్బులు కట్ అయినట్లు గ్రహించి నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపికృష్ణ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌కు చేసి ఓటీపీ నంబర్లు అడిగితే చెప్పొద్దని ఎస్‌ఐ సూచించారు.

సహజీవనం చేస్తున్న మహిళ హత్య

- పరారీలో నిందితుడు


ఉప్పలమ్మ మృతదేహం

చివ్వెంల(సూర్యాపేట): తనతో సహజీవనం చేస్తున్న మహిళను పదునైన ఆయుధంతో కొట్టి హత్య చేశాడో వ్యక్తి. ఈ ఘటన చివ్వెంల మండలం కుడకుడ గ్రామ శివారులోని ఎన్టీఆర్ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం పిల్లలమర్రి గ్రామానికి చెందిన ఉప్పలమ్మ(35)కు చివ్వెంల మండల పరిధిలోని కోమటికుంట గ్రామానికి చెందిన గట్టు ఉప్పలయ్యతో 12ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు సంతానం. ఆరేళ్ల క్రితం ఉప్పలయ్య అనారోగ్యంతో మృతిచెందగా.. ఉప్పలమ్మ కేతేపల్లి మండలం కొర్లపహాడ్ గ్రామానికి చెందిన వ్యక్తితో సహజీవనం చేసి ఒక కుమార్తెకు జన్మనిచ్చింది. కొంతకాలం తర్వాత వీరి మధ్య మనస్పర్థలు రావడంతో విడిపోయారు. ఆ తర్వాత చివ్వెంల మండల పరిధిలోని గాయంవారిగూడెం ఆవాసం టీకంతండాకు చెందిన ధరావతు రవితో ఉప్పలమ్మ సహజీవనం చేస్తోంది. రవికి అంతకుముందే పెళ్లై భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రవి, ఉప్పలమ్మ అంతకుముందు కుడకుడ గ్రామ శివారులోని ఎన్టీఆర్ కాలనీలో ఉంటుండగా, గత మూడు నెలల నుంచి సూర్యాపేట పట్టణంలోని శ్రీరాంనగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. బుధవారం అర్ధరాత్రి తిరిగి కుడకుడ గ్రామ శివారులోని ఎన్టీఆర్ కాలనీకి వచ్చిన వీరిద్దరి మధ్య గొడవ జరగ్గా రవి పదునైన ఆయుధంతో ఉప్పలమ్మ తల, నుదుటిపై బలంగా కొట్టడంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో రవి కుడకుడలోని పీఎస్‌ఆర్ టౌన్‌షిప్‌లో ఉంటున్న ఉప్పలమ్మ తల్లి లక్ష్మికి జరిగిన విషయం చెప్పి ఘటనా స్థలానికి తీసుకురాగా ఆమె కుమార్తెను చూసి బిగ్గరగా రోదించింది. దీంతో ఇరుగుపొరుగు వచ్చేసరికి రవి అక్కడ నుంచి పరారయ్యాడు. వెంటనే వారు 100కు డయల్ చేయడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఉప్పలమ్మను సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించగా, ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

మిర్యాలగూడ అర్బన్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన మిర్యాలగూడ పట్టణంలో చోటు చేసుకుంది. మిర్యాలగూడ వన్ టౌన్ ఎస్‌ఐ శివతేజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం వసురాంతండాకు చెందిన ధనావత్ దివ్యభారతి, ఆమె భర్త మాన్యానాయక్ కలిసి బతుకుదెరువు నిమిత్తం మిర్యాలగూడ పట్టణానికి వచ్చి స్థానిక హౌజింగ్ బోర్డు కాలనీలో నివాసముంటున్నారు. కాగా జూన్ 12వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన దివ్యభారతి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం ఆమె భర్త మాన్యానాయక్ మిర్యాలగూడ వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. దివ్యభారతి ఆచూకీ తెలిసిన 8712577241, 8712670149 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

అతివేగంగా వెళ్తూ కారు బోల్తా

- వాహనంలో గంజాయి ప్యాకెట్లు లభ్యం


ప్రమాదానికి గురైన కారు

చిట్యాల: అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బోల్తాకొట్టిన ఘటన చిట్యాల మండలంలోని వెలిమినేడు గ్రామ శివారులో జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి నలుగురు వ్యక్తులు స్విఫ్ట్ కారులో హైదరాబాద్ వైపునకు అతివేగంగా వెళ్తుండగా.. వెలిమినేడు గ్రామ శివారులోని ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి రహదారి పక్కన చెట్లను ఢీకొట్టి బోల్తా పడింది. స్థానికులు వెళ్లి చేసేసరికి కారులోని ముగ్గురు పరారవ్వగా.. హైదరాబాద్‌కు చెందిన గుంటి సాయివరుణ్ తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే పడిపోయాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి గురైన కారులో గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి చిట్యాల పోలీసులను సంప్రదించగా ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.

బంధువులు అవమానించారని ఆత్మహత్య


ఘటనా స్థలంలో గోపాలకృష్ణ మృతదేహం

హుజూర్‌నగర్: బంధువులు అవమానించారని మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం హుజూర్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ హరికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామానికి చెందిన తురక మట్టయ్యకు ముగ్గురు కుమారులు. చిన్న కుమారుడు తురక గోపాలకృష్ణ(32)కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన భవానితో 2019లో వివాహమైంది. వీరికి సంతానం లేదు. జూన్ 29న భవాని భర్తతో గొడవపడి పుట్టింటికి వెళ్లింది. మరుసటి రోజు గోపాలకృష్ణ తన భార్యను తీసుకొని రావడానికి జగ్గయ్యపేట వెళ్లాడు. అక్కడ భవానీ మేనమామ దేశగాని వెంకటేష్, అతడి తల్లి అప్పమ్మ గోపాలకృష్ణను తిట్టి అవమానించారు. అనంతరం హుజూర్‌నగర్‌కు వచ్చిన గోపాలకృష్ణ మనస్తాపంతో గురువారం పట్టణ శివారులోని పోతిరేనికుంట కట్టపై గల వేప చెట్టుకు ఉరేసుకొని మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి తండ్రి మట్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి గేదెలు మృతి


మృతిచెందిన గేదెలు

హుజూర్‌నగర్‌రూరల్: వ్యవసాయ భూమిలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి ఐదు పాడి గేదెలు మృతిచెందిన ఘటన హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. బూరుగడ్డ గ్రామ శివారులోని ఓ రైతు వ్యవసాయ భూమిలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి చిలుకూరు మండలం సీతారాంతండాకు చెందిన గుగులోతు బోజ్యానాయక్ చెందిన 2 గేదెలు, గుగులోత్ రవీందర్‌నాయక్‌కు చెందిన 2 గేదెలు, గరిడేపల్లి మండలం కట్టవారిగూడెం గ్రామానికి చెందిన బాల్దూరి సత్యనారాయణకు చెందిన ఒక పాడి గేదె మృతిచెందాయి. మృతిచెందని గేదెల విలు రూ.2.50లక్షలు ఉంటాయని బాధిత రైతులు తెలిపారు.

బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

ఆలేరురూరల్ : బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో, బీజేపీని అధికారంలో తీసుకురావాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, పఠాన్ చెరువు మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం ఆలేరు పట్టణ కేంద్రంలోని స్థానిక వైఎస్‌ఎస్ గార్డెన్‌లో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చెరిగె శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జనసమీకరణ సన్నాహక సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ నెల 8న వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదగాని హరిశంకర్‌గౌడ్, వట్టిపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి తిరుమల్‌రెడ్డి, కాదూరి అచ్చయ్య, సముద్రాల కల్పన, బడుగు జహంగీర్, రాఘవేంద్ర, లక్ష్మి, భిక్షపతి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

బీబీనగర్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను గురువారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ చైర్మన్ తోటకూరి అనురాధబీరయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాల గురించి నేరుగా వారిని అడిగి తెలుసుకున్నారు. కిచెన్ షెడ్‌తోపాటు, వంటలు, వసతి గదులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమయ్యారు. ఆమె వెంట శాఖ కమిటీ సభ్యులు పున్న లక్ష్మి, జోసెఫ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల ఉద్యమ ఫలితమే మెడికల్ కళాశాల

భువనగిరి: విద్యార్థి సంఘాల ఉద్యమ ఫలితమే జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు కావడం జరిగిందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగోర్ల మోదిరాందేవ్ అన్నారు. గురువారం భువనగిరి పట్టణంలోని బీసీ హస్టల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2017 నుంచి జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేయాలని ధర్నాలు, రాస్తారోకోలు, దీక్షలు, నిరసన ప్రదర్శనలు చేయడం జరిగిందన్నారు. 100 సీట్ల మెడికల్ కళాశాలను 150 సీట్లకు పెంచాలని కోరారు. సమావేశంలో సంతోష్, శేఖర్, కృష్ణయ్య, నాగరాజు, వీరేశం, రామకృష్ణ పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలి

- జెడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్

భువనగిరిటౌన్: జిల్లాలో కల్తీ విత్తనాలు సరఫరా కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్ అన్నారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన వ్యవసాయ స్థాయీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండే విధంగా జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు. సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతువేదికల్లో అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారిణి అనురాధ మాట్లాడుతూ కల్తీ విత్తనాలను అరికట్టేందుకు జిల్లాలో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీఈఓ కృష్ణారెడ్డి, సభ్యుడు సుబ్బారు బీరు మల్లయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఖాళీలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలపాలి

వసతి గృహాల్లో ఖాళీలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని సాంఘిక సంక్షేమ స్థాయీ సంఘం చైర్మన్ తోటకూరి అనూరాధ అన్నారు. గురువారం మధ్యాహ్నం నిర్వహించిన సాంఘిక సంక్షేమం స్థాయీ సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం అందించాలన్నారు. సమావేశంలో వివిధ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రధాని సభను విజయవంతం చేయాలి

- మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్


మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

తిరుమలగిరి (తుంగతుర్తి): వరంగల్ జిల్లాలో ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ కోరారు. గురువారం తిరుమలగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్‌లో రైల్వే మ్యానుఫ్యాక్చర్ యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నారని, ఈ యూనిట్‌తో వందలాది మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అదేవిధంగా జాతీయ రహదారులకు వరంగల్, ఖమ్మం గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవేకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. త్వరలోనే మెగా టెక్స్‌టైల్ పార్కు, ట్రైబల్ యూనివర్సిటీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాల్వల ద్వారా వచ్చేది జిల్లాకు వచ్చేది గోదావరి జలాలే అని, కాళేశ్వరం జలాలు కావన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, పేరాల పూలమ్మ, సాయిబాబా, మల్సూర్ గౌడ్, అయోధ్య, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ధీన్‌దయాళ్, వెంకట్‌రెడ్డి, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎవరికీ బీ టీమ్ కాదు

- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి


పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న గొంగిడి మహేందర్‌రెడ్డి


యాదగిరిగుట్ట రూరల్: బీఆర్‌ఎస్ ఎవరికీ బీ టీమ్ కాదని డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో తుర్కపల్లి మండలం దయ్యాలబండ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వాళ్లు బీజేపీకి బీఆర్‌ఎస్ బీ టీమ్ అని దుష్ప్రచారం చేస్తున్నారని బీఆర్‌ఎస్‌కు బీజేపీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో రూ.4000 పింఛన్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తుర్కపల్లి ఎంపీపీ భూక్యా రవీందర్ నాయక్, పిన్నపు నరేందర్ రెడ్డి, మాడోతు లక్ష్మా, సంతు, పాండు,రమేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, రాజనర్సయ్య, హరినాయక్, బాలరాజ్, నరేందర్ నాయక్, లక్ష్మణ్, మహేందర్, వెంకటేశ్, మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

తొలకరిలో జీవాలకు చిటుక వ్యాధి ముప్పు

- ముందస్తుగా గుర్తించకపోతే చనిపోయే ప్రమాదం
- కోదాడ మండల పశువైద్యాధికారి నాగేంద్రబాబు




జీవాలకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి (ఫైల్)



కోదాడరూరల్: వర్షాకాలం ప్రారంభంలో కురిసే తొలకరి జల్లులతో జీవాలకు వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. వర్షాలకు పచ్చిగడ్డి పెరుగుతుంది. ఈ గడ్డి జీవాలు తింటే ఎలాంటి రోగ లక్షణాలు కనిపించకుండానే చిటుక వ్యాధి(ఎంటరోటోక్సివియా) సోకి జీవాలు చనిపోయే ప్రమాదం ఉందని కోదాడ మండల పశువైద్యాధికారి నాగేంద్రబాబు అంటున్నారు. చిటికె వ్యాధిని ఆయా ప్రాంతాల్లో నెత్తిపిడుగు, గడ్డి రోగం వంటి పేర్లతో పిలుస్తుంటారని, జీవాలు ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించినప్పటికీ హఠాత్తుగా చనిపోతాయని ఆయన పేర్కొన్నారు. ఈ వ్యాధి లక్షణాలు, వ్యాధి సోకకుండా గొర్రెల కాపరులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే..

చిటుక వ్యాధి వ్యాప్తి ఇలా..

క్లస్టీడియం అనే సూక్ష్మజీవులు గాలి లేని(ఎనిరోబిక్) వాతావరణంలో వదలబడిన విష పదార్థాలు(టాక్సిన్లు) ఈ వ్యాధికి కారణమవుతాయి. తొలకరి వర్షాలకు పెరిగిన లేత గడ్డిని గొర్రెలు అధికంగా తింటాయి. దీంతో పేగుల్లో గాలిలేని వాతావరణం ఏర్పడటం ద్వారా సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది ఈ వ్యాధిని కలిస్తాయి. ఈ వ్యాధి మే నెల చివరి నుంచి జూలై చివరి వరకు ఎక్కువగా కనిపిస్తుంది. నవంబర్, డిసెంబర్ మాసాల్లో కూడా వ్యాపించే అవకాశాలు ఉన్నాయి.

చికిత్స నివారణ..

జీవాల జీర్ణకోశంలో సూక్ష్మజీవుల వ్యాప్తిని అరికట్టేందుకు టెట్రాసైక్లిన్, ఆంఫీసిలిన్, జెంటామైసిన్ వంటి మందులను క్లోరిల్, ఎపిల్ వంటి ఇంజక్షన్‌లను పశువైద్యుని పర్యవేక్షణలో వాడుతుండాలి. ప్రతి సంవత్సరం ఏప్రిల్, మే నెలల్లో వ్యాధినిరోధక టీకాలు (మల్టీకాంపొనెట్, ఈటీ వ్యాక్సిన్)వేయించాలి. రెండో విడతగా అక్టోబర్, నవంబర్ మాసాల్లో వేయించాలి. తొలకరి వర్షాలకు మొలిచి వాడిపోయిన గడ్డిని సాధ్యమైనంత వరకు జీవాలు మేయకుండా కాపరులు జాగ్రత్తలు తీసుకోవాలి. మేత కోసం వలస వెళ్లే జీవాలకు వలస ప్రాంతాల్లో గల వ్యాధులను బట్టి ముందే వ్యాధినిరోధక టీకాలు వేయించుకోవడం ద్వారా వ్యాధిని నివారించుకోవచ్చు. జీవాలను ఉదయం కొంచెం ఆలస్యంగా మేతకు తీసుకెళ్లడం, మధ్యాహ్నం కొంతసేపు విశ్రాంతి ఇవ్వడం, సాయంత్రం త్వరగా ఇంటికి తీసుకురావడం వల్ల వాటి జీర్ణాశయంలో కొంత ఖాళీ ఏర్పడి సూక్ష్మజీవులు అభివృద్ధి చెందకుండా చూడవచ్చు.

వ్యాధి లక్షణాలు..

ఎలాంటి రోగ లక్షణాలు కనిపించకుండానే ఉన్నట్లుండి జీవాలు చనిపోతాయి. చనిపోయే ముందు గొర్రెలు, మేకులు నీరసంగా ఉండటం గమనించవచ్చు. జీవాలు గాలిలోకి ఎగిరి కిందపడి కాళ్లు గిలగిల కొట్టుకుంటూ పళ్లు కొరుకుతూ వణుకుతూ బిగుసుకపోయి నిమిషాల్లో చనిపోతాయి. కొన్ని జీవాలు నోటి నుంచి నురుగు, చొంగ కారుస్తాయి. శ్వాస పీల్చే శాతం ఎక్కువగా కనిపిస్తుంది. కొన్ని సందర్భాల్లో మలబద్ధకం, కడుపు ఉబ్బరం ఉంటుంది. మేత మేయకుండా, నెమరు వేయకుండా తలల వాల్చి, ముడుచుకుని ఒకే చోట నిలబడతాయి. ఈ వ్యాధి లక్షణాలు ఎక్కువగా ఉదయం, సాయంత్రం వేళల్లో కనిపిస్తుంటాయి.